నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కీసర: కీసర సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కె.వి. విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 24న (నేడు) కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కీసర ఏఈ మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు కీసర గ్రామ పరిధిలో, అలాగే పెద్దమ్మ చెరువు 11 కె.వి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా కేజీఎఫ్ వెంచర్ మెయిన్ రోడ్డు పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఘట్‌కేసర్‌లో..

ఘట్‌కేసర్: అంకుసాపూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చందుపట్లగూడ, ఎదులాబాద్, మర్పల్లిగూడ, కొత్తగూడెం, ఎన్ఎఫ్‌సీ నగర్, బొక్కొనిగూడ, అంకుసాపూర్, మాదారంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సతీశ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 33/11కేవీ కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవుసాపూర్, సింగరేణి కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నాగారం మున్సిపల్ పరిధిలో..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 11 కె.వి. సింహపూరి కాలనీ ఫీడర్, గాంధీనగర్ 11 కె.వి. ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఈ నెల 24న (నేడు) పలు కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని నాగారం ఏఈ కామేశ్వర్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సింహపూరికాలనీ, ఓల్డ్‌విలేజ్ వికాస్‌నగర్, వెంకటేశ్వరనగర్, నవతకాలనీ, హరితపూరికాలనీ, మధురానగర్, దుర్గయ్యనగర్, దత్తాత్రేయనగర్, తిరుపతికాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, గాంధీనగర్, మాదిరెడ్డిమల్లారెడ్డి, బీఎంఆర్ఎన్‌క్లేవ్, వెస్ట్‌గాంధీనగర్, భవానీనగర్, శివాలయం మెయిన్ రోడ్డు, రాంపల్లిఎక్స్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

అండర్ పాస్‌ను త్వరగా పూర్తి చేయిస్తాం

మేడ్చల్: కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి మేడ్చల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఆర్వోబీ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. పట్టణ కాంగ్రెస్ నాయకులతో కలిసి బ్రిడ్జి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంపూర్తి బ్రిడ్జి వల్ల చాలా గ్రామాల ప్రజలు, పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.జడ్పీ చైర్మన్ వెంట నాయకులు సత్యనారాయణ, మల్లేశ్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

పాలకవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ శివశంకర్

ఘట్‌కేసర్: ప్రతాపసింగారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వంగూరి శివశంకర్ అధ్యక్షతన మంగళవారం పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించి పంచాయతీ ఆదాయ, వ్యయాలపై చర్చించారు. అలాగే ఐదేళ్లలో గ్రామాభివృద్ధికి సహకరించిన వారందరికీ సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఉప సర్పంచ్ అబేదా బేగం, వార్డు సభ్యులు లలిత, భార్గవి, హంసమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఇంద్రసేనారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేశ్ పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలి



విద్యార్థులకు స్లిప్పర్స్, మ్యాట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కీసర: నిరుపేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గ్రీన్‌పోల్ ముంబై కంపెనీ సహకారంతో విశ్వానీ సాంగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చెప్పులు (స్లిప్పర్స్) ,సిట్టింగ్ మ్యాట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ జాతీయ కార్యదర్శి మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లోని 2,345 మంది విద్యార్థులకు అందిస్తామన్నారు. అందులో భాగంగా మొదటిరోజు నాగారం ఉన్నత , ప్రాథమిక పాఠశాలల్లోని 1324 మందికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్‌చైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి



ఎమ్మెల్యేతో సూపరింటెండెంట్ డాక్టర్ సునీత

మల్కాజిగిరి: ప్రజలకు మెరుగైన సేవలందించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ సునీతకు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యేను సూపరింటెండెంట్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న వసతుల గురించి ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, ఆస్పత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమెకు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంగీత్ ఉన్నారు.

పూజా స్టోర్‌లో అగ్ని ప్రమాదం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని పూజా స్టోర్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఆనంద్‌బాగ్ క్రాస్ రోడ్స్‌లో కేశవ దేవరాయ మణికంఠ కోకోనట్, పూజా సామగ్రి దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగానే రాత్రి స్టోర్‌కు తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి పొగలు వస్తుండంతో స్థానికులు 100కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజిన్ మంటలార్పింది. అప్పటికే స్టోర్‌లో ఉన్న సామగ్రి మొత్తం అగ్నికి ఆహూతైంది. ఈ ఘటన పైఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ప్రమాద స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్, సర్కిల్ ఉప కమిషనర్ జి.రాజు పరిశీలించారు.

వాడీవేడిగా 'జడ్పీ' సమావేశం

జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహణ



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

- అక్రమాలపై సభ్యుల గరం..గరం
- స్కూళ్లపై నిర్లక్ష్యం, జీపీల్లో నిధుల లేమిపై ఆవేదన
- పల్లె, బస్తీ దవాఖానలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత
- డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు.. అర్హుల ఎంపికపై గుస్సా

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ సమావేశం హాల్‌లో చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన జడ్పీ సాధారణ సర్వసభ్య వాడీవేడిగా జరిగింది. పంచాయతీల్లో అక్రమ కట్టడాలు, వాణిజ్య పన్నుల వసూళ్లలో చేతి వాటం ప్రదర్శన, శిథిలావస్థలోని ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకపోవడం, పల్లె , బస్తీ దవాఖానల్లో డాక్టర్లు , సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరత, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు తదితర సమస్యలపై పలువురు సభ్యులు ప్రశ్నించారు. ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఏదులాబాద్ ఉన్నత పాఠశాల గదులు శిథిలావస్థలో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే బస్తీ, పల్లె దవాఖానలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదులాబాద్ గ్రామ కార్యదర్శి రూ.75 లక్షలు దుర్వినియోగం చేసినా.. మళ్లీ ఉద్యోగంలో చేరారని, వీటన్నింటిపై కొత్త ప్రభుత్వం, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే విద్యుత్ కోతలు, కోతులు బెడద లేకుండా చూడాలని కోరారు. మండలంలో పంచాయతీ సిబ్బంది చేతి వాటంతో కొనసాగుతున్న అక్రమ కట్టడాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల్లో అర్హుల ఎంపిక సరిగ్గా జరగలేదని ఆరోపించారు.

- జడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్ మాట్లాడుతూ చీర్యాల గ్రామంలో కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీల్లో 40 కుటుంబాలు రెండేళ్లుగా కరంట్, తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. చీర్యాల్లోని పలు కాలనీల్లో పట్టా భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి నంబర్లు కేటాయించి , ఇంటి పన్నులు వసూలు చేయాలని కోరారు.
- శామీర్‌పేట ఎంపీపీ ఎల్లుబాయి మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలకు అడ్డుఅదుపు లేదన్నారు. మోట బావులను సరిగ్గా పూడ్చకుండానే భవనాలు కడుతున్నారని, వాటిని అడ్డుకోవాలని కోరారు. శామీర్‌పేట దవాఖానలో డాక్టర్లు , సిబ్బంది లేకపోవడతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పన్నుల వసూళ్లలో జీపీ సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ.. పూర్తి స్థాయిలో పన్నులు నిర్ధారించకపోవటంతో వారు తక్కువ పన్నులు చెల్లిస్తున్నారని ఆరోపించారు.
- మూడుచింతలపల్లి జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానిక అర్హులైన పేదలకు కేటాయించిన తర్వాతే ఇతర ప్రాంతాల (హైదరాబాద్ నగరం) వారికి ఇవ్వాలని కోరారు. ఈ విషయంలో మిగతా సభ్యులు కూడా సంపూర్ణ మద్దతు తెలిపారు.
- శామీర్‌పేట జడ్పీటీసీ అనిత మాట్లాడుతూ బెల్ట్ షాపులను అరికట్టాలని, అలాగే వైన్ షాపుల వద్ద పరిమితులకు మించి పర్మిట్ రూమ్‌లు నిర్మిస్తున్నారని, ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ స్పందించాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, పంచాయతీ, ఉద్యానవన, పశు సంవర్ధక, వైద్య, ఆరోగ్యం, వివిధ సంక్షేమ శాఖలు చేపడుతున్న పలు అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాల ప్రగతి, అమలుపై సభ్యులు చర్చించారు. ఇందులో కలెక్టర్ గౌతమ్, జడ్పీ సీఈవో దేవసహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీ, ఎంపీపీలు పాల్గొన్నారు.



కలెక్టర్ గౌతమ్‌ను సన్మానిస్తున్న జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

మేడ్చల్ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దాం

సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మరింత అభివృద్ధి జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. మేడ్చల్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఉందన్నారు. నూతన ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందన్నారు. అలాగే ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుందని పేర్కొన్నారు.

అర్హులకు అందించాల్సిన బాధ్యత అధికారులదే: కలెక్టర్ గౌతమ్

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ గౌతమ్ అన్నారు. అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో మరింత బాగా పని చేయాలని కోరారు. గ్రామపంచాయతీల్లో ఇళ్లు, వాణిజ్య పన్నుల వసూళ్లు సక్రమంగా చేస్తేనే అభివృద్ధి పనులు చేసుకునేందుకు అవకాశముంటుందని, దీన్ని అధికారులు దృష్టిలో పెట్టుకొని పని చేయాలని సూచించారు. మేడ్చల్ నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి జడ్పీ సభ్యులు కోరినట్లుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సూచనల మేరకు నడుచుకుంటామన్నారు. అర్హుల ఎంపికలో పొరపాట్లు ఉంటే పరిశీలిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, ఎంపీపీలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎల్లుబాయి, జడ్పీటీసీలు హరివర్ధన్‌రెడ్డి, అనిత, కోఆప్షన్ సభ్యులు మధూకర్‌రెడ్డి, గౌస్, జైహింద్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, మేడ్చల్ జడ్పీటీసీ శైలజ హాజరు కాలేదు.

కలెక్టర్‌ను సన్మానించిన చైర్మన్

మొదటిసారిగా జడ్పీ సమావేశానికి హాజరైన కలెక్టర్ గౌతమ్‌ను జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో దేవసహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ చంద్రారెడ్డి

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

నివాళులర్పించిన నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు చంద్రబోస్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుండ్లపోచంపల్లిలో మున్సిపల్ కమిషనర్ రాములు, మాజీ ఎంపీటీసీలు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, వంశీధర్‌రెడ్డి, నాయకులు నివాళులర్పించారు.



గుండ్లపోచంపల్లిలో చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పోతాయిపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



అత్వెల్లిలో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

తూంకుంట మున్సిపాలిటీలో..

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని పోతాయిపల్లిలో కాంగ్రెస్ నాయకులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీగౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి దర్శన్‌గౌడ్, పార్టీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ రాంచందర్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, యువకులు పట్టణంలోని వివేకానంద, అంబేద్కర్ విగ్రహాల వద్ద నేతాజీ చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిర్మాపూర్, అత్వెల్లి, రాయిలాపూర్ తదితర గ్రామాల్లోనూ నాయకులు నేతాజీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అలాగే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు నేతాజీ గొప్పతనం, దేశ భక్తిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ స్వామి, జగన్‌గౌడ్, ప్రేందాస్, రాఘవరెడ్డి, ఈశ్వర్, వెంకటేశ్ మాజీ సర్పంచ్ యాదగిరి వివిధ యువజన సంఘాల యువకులు తదితరులు పాల్గొన్నారు

గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు

- మేడ్చల్ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి
- గౌడవెల్లిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

మేడ్చల్: జడ్పీతో పాటు మరిన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గౌడవెల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతికి సేవలందించిన నేతల విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సీసీ రోడ్లను ప్రారంభించి, గ్రామ పంచాయతీ భవనంలో మొదటి అంతస్తు నిర్మాణం, పశు వైద్యశాల, పల్లె పకృతి వనం, హరిత నర్సరీల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, ఉప సర్పంచ్ పెంటమ్మ, నాయకులు గోపాల్, రవిముదిరాజ్, భగవాన్‌దాస్, వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.



మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

కాంగ్రెస్‌తోనే కురుమల అభివృద్ధి

ఉప్పల్: కాంగ్రెస్ పార్టీతోనే కురుమల అభివృద్ధి సాధ్యమని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కురుమ సంఘం భవనం అదనపు అంతస్తు నిర్మాణం కోసం రూ.30 లక్షలు మంజూరు చేయించడంతో ఉప్పల్ కురుమ సంఘం నేతలు వారిని అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో చేయూత అందించిన విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

బీరప్ప దేవాలయం అభివృద్ధికి కృషిచేస్తా

మల్లాపూర్: బీరప్ప మహాంకాళి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని దేవాలయం చైర్మన్ చిగుళ్ల శ్రీనివాస్ కురుమ అన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మంగళవారం గుడి కమిటీ సభ్యులు శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మల్లాపూర్ కురమ సంఘం అధ్యక్షుడు బెల్లం బక్కయ్య కురుమ, వైస్ చైర్మన్ సీతాల వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి చౌదరిపల్లి పర్వతాలు కురుమ, గ్రామ కమిటీ వైస్ చైర్మన్ కంది రాములు, ప్రధాన కార్యదర్శి బొడ్డు నాగమల్లయ్య, కోశాధికారి బండి లింగం కురుమ తదితరులు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: గట్టుమైసమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో మంగళవారం చర్చించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 28న జరగనున్న జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని, అలాగే జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించాలని పోలీసులకు సూచించారు. క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబేర్ అలీ, సీఐ మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, ఎస్ఐ శేఖర్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య తదితరులు

త్వరలో నూతన ఆలయ కమిటీలు



రామంతాపూర్: కేసీఆర్ నగర్‌లోని బీరప్ప దేవాలయానికి సొంత నిధులతో నిర్మించే షెడ్డు పనులను మంగళవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఎండోమెంట్ పరిధిలో ఉన్న అన్ని దేవాలయాలకు త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని, విషయాన్ని దేవాదాయ శాఖ మంత్రి దృష్టికి కూడా తెచ్చామని, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రేవు కృష్ణయ్య, తోఫిక్, సర్వే మురళీగౌడ్, సాగర్, రవీందర్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైన్ షాప్ తొలగించకపోతే ఆందోళనే..



టీవీ కాలనీలో మద్యం దుకాణం

రామంతాపూర్: నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి అంబర్‌పేట్ అలీ కేఫ్‌కు వెళ్లేందుకు రామంతాపూర్ నుంచి నిర్మించిన సర్వీస్ రోడ్డులో ఇరువైపులా విచ్చలవిడిగా మద్యం షాపులకు ఇటీవల ఉప్పల్ ఎక్సైజ్ అధికారులు అనుమతులు ఇవ్వడం దారుణమని, వెంటనే రద్దు చేయాలని మంగళవారం ఉప్పల్ మండల ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ కార్యదర్శి పల్లవి డిమాండ్ చేశారు. ఇటీవల రామంతాపూర్‌లోని టీవీ కాలనీలో జనావాసాల మధ్య వైన్‌షాప్‌నకు అనుమతి ఇవ్వడంతో స్థానిక ప్రజలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ విషయాన్ని ఎక్సైజ్ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే షాపులను రద్దు చేయకపోతే ప్రజాసంఘాలు, మహిళా సంఘాలతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలోని కాలనీల్లో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని దాదాపు అన్ని డివిజన్లలో నీటి సమస్య ఉందని, కొన్ని చోట్ల లీకేజీ, మరికొన్ని చోట్ల కలుషిత నీరు సరఫరా కావడం వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కోరారు. వేసవిలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అందుకు ఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వర్‌రావు, మహేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటాం

మల్లాపూర్: ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొంటామని జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలోని ఇన్‌వార్డ్‌లో సమ్మె నోటీస్‌ను అందజేసినట్లు కాప్రా సర్కిల్ బీఆర్‌టీయూ నేత కుర్మన్న తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, కూలీల వ్యతిరేఖ విధానాలకు నిరసనగా జాయింట్ ఫ్లాంట్ ఫాం ట్రేడ్ యూనియన్స్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొంటామని పేర్కొన్నారు.